ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 15 ఫిబ్రవరి 2024





అలయం ఎదుట పడి ఉన్న క్యూలైన్ల రెయిలింగ్

పాసుల జారీలో అయోమయం

ఈ ఏడాది కేవలం 3వేల వీఐపీ పాసులను మాత్రమే యూనియన్ బ్యాంకు (అరసవల్లి బ్రాంచ్) ద్వారా అనుమతించారు. దీంతో భక్తులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. అలాగే 1430 డోనర్ పాసులకు గాను ఇంతవరకు 600 మాత్రమే ఇచ్చినట్లు సమాచారం. మిగతా పాసులను ఏం చేస్తారో, ఎప్పుడు ఇస్తారో వారికే తెలియాలి. గతేడాది వీఐపీ పాసుల విషయంలో అధికారులు ముందుగానే భక్తులకు అవగాహన కల్పించగా, ఈసారి అది పూర్తిగా కనుమరుగైంది.



అరసవల్లిలో ఆదిత్యుడి ఆలయం

ఆదిత్యా.. నువ్వే రక్ష

- రథసప్తమికి అరకొర ఏర్పాట్లు
- లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా
- కానీ 60 వేల మందికే ఏర్పాట్లు
- గత సమస్యలను అధిగమించేనా?
- నేటి అర్ధరాత్రి నుంచే వేడుకలు

అరసవల్లి, ఫిబ్రవరి 14: సూర్యనారాయణ స్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం అర్ధరాత్రి నుంచే అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. శుక్రవారం వేకువ జాము నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. ఆరోగ్యప్రదాతను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ప్రతీ ఏడాదిలాగానే ఈసారి కూడా రథసప్తమి వేడుకల ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ పాలకమండలి రెండుసార్లు సమావేశమై పలు సూచనలు, సలహాలను స్వీకరించి నిర్ణయాలు తీసుకుంది. ఆర్డీవో రంగయ్య ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అయితే, పూర్తిస్థాయిలో కాకుండా నామమాత్రపు ఏర్పాట్లు చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది రథసప్తమికి 1.20 లక్షల మంది భక్తులు వస్తే అధికారులు మాత్రం 60వేల మందికే ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఏడాది కూడా గత సంవత్సరానికి ఏమాత్రం తగ్గకుండా భక్తులు వస్తారని అంచనా ఉన్నప్పటికీ మళ్లీ 60వేల మందికే ఏర్పాట్లు చేసేందుకు ఆలయ అధికారులు నిర్ణయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది రూ.100 క్యూలైన్లలో భక్తులు తూర్పు ఈశాన్య ద్వారం వద్ద నుంచి ప్రవేశించగా, వారు గంటల కొద్దీ క్యూలైన్లలోనే ఉండి పోయారు. ఒకవైపు ఎండ తీవ్రత, మరో వైపు కనీసం తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి. దీంతో కొంతమంది భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు. పేరుకే తాగునీరు, పాలు, బిస్కెట్లు సరఫరా చేస్తున్నామని అధికారులు చెప్పడమే తప్ప ఏమీ దొరకని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, దివ్యాంగుల కోసం తగినన్ని చక్రాల కుర్చీలు లేకపోవడంతో వారు స్వామి వారిని దర్శించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనారోగ్యానికి, అస్వస్థతకు గురైన భక్తులకు సత్వర చికిత్స అందించేందుకు ఒక ఎమర్జెన్సీ మార్గాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మరిన్ని మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి తగినంత మందులు, ఆరోగ్య సిబ్బందిని, వైద్యులను అందుబాటులో ఉంచాలని, ఫీడింగ్ కేంద్రాల సంఖ్యను పెంచాలని, పాలను తగినంతగా సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు.

● గత ఏడాది వీఐపీ భక్తుల క్యూలైన్ వద్ద తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విశాలమైన ఆలయ అనివెట్టి మండపం నుంచి నేరుగా స్వామివారి దర్శనానికి భక్తులను విడిచిపెట్టారు. వీరు ధ్వజస్తంభం దాటిన తరువాత ఒక్క వ్యక్తి మాత్రమే వెళ్లేందుకు లైన్ ఉండడంతో తోపులాట జరిగింది. ఈ ఏడాది వీవీఐపీలు, వీఐపీలకు ఆలయ అనివెట్టి మండపం ప్రారంభం నుంచే రెండు లైన్లను ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా దర్శనం చేసుకునే వీలుంటుంది.

● గత సంవత్సరం ఉచిత దర్శనానికి వచ్చిన భక్తులు ఇంద్రపుష్కరిణి మీదుగా వచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ఆలయ రాజగోపురం వద్ద క్యూలైన్లకు చేరుకున్నారు. అక్కడ ఎండలో నిల్చుని, తాగునీరందక చాలా అవస్థలు పడ్డారు. ఈసారైనా అధికారులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● అరసవల్లిలోని మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో భక్తుల కేశఖండన, స్నానాలకు సరిపడినంత ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారైనా స్నానపు గదుల సంఖ్యను పెంచాలి.

● లక్ష మందికి పైగా భక్తులు దర్శనానికి వచ్చే రోజున కేవలం ఒక్క ప్రసాదం కౌంటర్‌తోనే పని కానిచ్చేయడం సరికాదు. కౌంటర్ల సంఖ్యను పెంచాలని భక్తులు కోరుతున్నారు. కాగా, మరో కొన్ని గంటల్లో వేడుకలు ప్రారంభమవుతున్నా సరే ఏర్పాట్లు ఇంకా ఊపందుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.



ఇంద్ర పుష్కరిణి ఖాళీ

ఉత్సవానికి కేవలం వారం ముందు అభివృద్ధి పేరిట ఇంద్ర పుష్కరిణిలోని నీటికి మోటార్లతో తోడించేశారు. దీంతో పుష్కరిణి పూర్తిగా ఎండిపోయింది. భక్తులు గతంలో పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, ఆదిత్యునికి క్షీరాన్నం వండి, సమర్పించి మొక్కులు చెల్లించుకునే వారు. ఈ ఏడాది పుష్కరిణిలో నీరు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

నేటి నుంచి నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

శ్రీకాకుళం క్రైం: రథసప్తమిని పురస్కరించుకుని గురువారం రాత్రి 8గంటల నుంచి శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ● పెద్దపాడు నుంచి రామలక్ష్మణ మీదుగా వాహనాలపై వచ్చే భక్తులు సూర్యమహల్, చిన్నబరాటం వీధి మీదుగా పాతబస్టాండ్ గుండా జిల్లా పరిషత్, సంతోషిమాత ఆలయం మీదుగా వాంబే కాలనీ 80 అడుగుల రోడ్డుకు చేరుకుని అక్కడ వాహనాలను పార్క్ చేసి అరసవల్లికి రావాలని తెలిపారు. ● విశాఖపట్నం మీదుగా నుంచి వచ్చే వారు నవభారత్, ఏడురోడ్ల గుండా పాతబస్టాండ్, జిల్లా పరిషత్, సంతోషిమాత గుడి, వాంబేకాలనీ చేరుకుని 80 అడుగుల రోడ్డులో వాహనాలు పార్క్ చేసుకోవాలన్నారు. ● కొత్తరోడ్, బలగ మీదుగా వచ్చే వాహనదారులు ఆర్టీసీ కాంప్లెక్స్, డేఅండ్ నైట్ నుంచి పాతబస్టాండ్, జిల్లా పరిషత్ మీదుగా ఎనభై అడుగుల రోడ్డుకు చేరుకోవాలని సూచించారు. ● గార, శ్రీకూర్మం మీదుగా వచ్చే వారు వాడాడ జంక్షన్‌లో వాహనాలు పార్క్ చేసి అరసవల్లి రావాలని వివరించారు. ● జాతీయ రహదారి నుంచి మునసబుపేట సర్వీసు రోడ్డు ద్వారా చిట్టివానిపేట, సానివాడ మీదుగా ఒప్పంగి గ్రామం నుంచి వాడాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో వాహనాలు నిలిపి అరసవల్లి రావాలన్నారు. ● ఆదిత్యుని దర్శనం చేసుకున్నవారు 80 అడుగుల రోడ్డులో వాహనాలు తీసుకుని ఉమెన్స్ కాలేజి మీదుగా సూర్యమహల్ కూడలి నుంచి రామలక్ష్మణ మీదుగా పెద్దపాడు వెళ్లాలని సూచించారు. భక్తులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

నేటి కార్యక్రమాల వివరాలు..

మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా గురువారం అర్ధరాత్రి (తెల్లవారితే శుక్రవారం) 12.30 గంటల నుంచి రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. రాత్రి ఒంటి గంట నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు స్వామివారికి క్షీరాభిషేకం, 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిజరూప దర్శనం, 4 నుంచి రాత్రి 11 గంటల వరకు అలంకార సేవ ఉంటుంది. మధ్యలో సాయంత్రం 6 గంటలకు స్వామివారికి మంగళహారతి సమర్పణ జరుగుతుంది. రాత్రి 11 గంటలకు స్వామివారికి పవళింపు సేవ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

ఎలాంటి అసౌకర్యం కలగకూడదు: కలెక్టర్

రథసప్తమి వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంతోపాటు, ఉచిత దర్శనం, వీఐపీ, వీవీఐపీ క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలను జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తరువాత స్థానిక 80 అడుగుల రోడ్డుకు చేరుకుని వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, డీఎస్పీ దీప్తి, సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్, ఆర్డీవో సీహెచ్ రంగయ్య, ఆలయ ఈవో రమేష్‌బాబు, పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నేడు ఎచ్చెర్లలో 'శంఖారావం'

శ్రీకాకుళం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలో గురువారం శంఖారావం కార్యక్రమం జరగనుంది. నియోజకవర్గంలోని లావేరు మండల కేంద్రంలో జరిగే బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొని ప్రసంగించనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లో కార్యక్రమం పూర్తయింది. గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంతో జిల్లాలో శంఖారావం పూర్తికానుంది. సాయంత్రం 4 గంటలకు లావేరుకు లోకేశ్ చేరుకుంటారు. 4.45 గంటలకు టీడీపీ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున ప్రసంగిస్తారు. ఆ తర్వాత జనసేన విజయనగరం జిల్లా అధ్యక్షురాలు లోకం నాగమాధవి, నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వక్‌సేన, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళావెంకటరావు మాట్లాడతారు. 5.06 గంటలకు లోకేశ్ ప్రసంగిస్తారు. అనంతరం నెల్లిమర్ల వెళ్లనున్నారు.



'నమస్తే'లో పేర్లు నమోదు చేసుకోండి

అరసవల్లి: నేషనల్ ఏక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్(నమస్తే) పథకంలో కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచే కార్మికులు, ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్ల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పన, సామాజిక న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగరపాలక కార్యాలయం వద్ద ఈ నెల 19న ఉదయం 9 గంటలకు ఈ పథకంలో నమోదు కార్యక్రమ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఏదైనా సంస్థలో పనిచేస్తున్న గుర్తింపు కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ వివరాల నకళ్లు సమర్పించి నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత వైద్యం, మెరుగైన ఉపాధికి రుణాలు, పిల్లలకు స్కాలర్‌షిప్పులు అందుతాయని తెలిపారు.

సరస్వతీ నమస్తుభ్యం



సరస్వతీదేవి అలంకరణలో విజయదుర్గ

● ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 14: జిల్లాలో వసంత పంచమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. సరస్వతీ దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతిదేవి, ఇతర ఆలయాలు, పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నానుబాల వారి వీధిలో ఉన్న విజయ దుర్గ ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. విజయ గణపతి ఆలయంలో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు అందజేశారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



సామూహిక అక్షరాభ్యాసాలు

తహసీల్దార్ రమణయ్య కుటుంబానికి అండగా ఉంటాం

● రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు

నందిగాం, ఫిబ్రవరి 14: విశాఖలో హత్యకు గురైన నందిగాం మండలం దిమిలాడకు చెందిన తహసీల్దార్ సనపల రమణయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన రమణయ్య కుటుంబాన్ని దిమిలాడలో పరామర్శించారు. ఈ సందర్భంగా రమణయ్య భార్య, పిల్లలు, తల్లి శంకుతలమ్మతో మాట్లాడారు. రకరకాల వ్యక్తులతో మమేకమైన రెవెన్యూశాఖలో ఈ సంఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. భూతగాదాల పరిష్కారానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా అధిక భూధరలు, భూ ఆక్రమణలు ఉన్న సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరారు. శ్రీకాకుళం, విశాఖ జిల్లాల సంఘాల తరఫున తక్షణ సహాయంగా రమణయ్య కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు ఎ.త్రినాథరావు, బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బీవీఎస్.రాజు, కోశాధికారి జీవీ.శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజన్ అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, ఆర్.రామారావు, కార్యవర్గ సభ్యులు అమరనాథ్, గౌరీశంకర్, బి.గౌరీ పాల్గొన్నారు.



రమణయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

దుర్గంధం

చిత్రంలో చూస్తున్నారుగా.. ఇది బమ్మి డి ఆరోగ్య ఉపకేంద్రం.. లోపలికి మురుగునీటిని దాటుకుని వెళ్లాయి.. ఆరోగ్య కేంద్రం ఎదుటే పారి శుధ్య సమస్య ఉంటే ఎలా అని పలువురు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సిబ్బంది చెట్ల కింద వైద్య సేవలు అందిస్తున్నారు. అధికారులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్రానికి మరమ్మ తులు చేపట్ట డంతో పాటు పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు చింతాడ కోటేశ్వరరావు తదితరులు కోరుతున్నారు.

-కొత్తూరు



సబ్ సెంటర్ ఎదుట దుర్గంధంగా ఉన్న దృశ్యం

ప్రమాదకరం

మండలంలోని డీపీఎన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డు వేసి బెర్మ్‌లను తవ్వే యడంతో ప్రమాద కరంగా మారింది. పాలతలగాం వద్ద రోడ్డుకి పక్క నున్న ప్రదేశాన్ని కలుపుతూ వేసి న బర్మ్‌ను తవ్వి కాలువ గా ఏర్పాటు చేయడంతో ఎదురెదురు వాహనాలు వచ్చేటప్పుడు తప్పించే ప్రయత్నంలో బోల్తా కొట్టి ప్రమాదాలు జరుగు తున్నా యి. ఇటీవల ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన డంతో ఇద్దరికి తీవ్ర గాయా లయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

-సంతబొమ్మాళి



పాలతలగాం వద్ద బెర్మ్ లేక ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

నిరుపయోగం

తహసీల్దార్ కార్యాలయానికి ఉపయోగ పడాల్సిన జనరేటర్ ప్రస్తుతం పాత కార్యాలయం వెనక మూలన పడి ఉంది. దీంతో ప్రజాధనం వృథా అయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే సరైన నిర్వహణ లేక మూలకు చేరింది. ఆ తరువాత కార్యాలయం మార్పు చేయడంతో దీనిని అక్కడే వదిలేశారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

-పలాసరూరల్



పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న జనరేటర్

నిర్లక్ష్యం



నెహ్రూనగర్‌లో సీసీ రోడ్డు దుస్థితి...

ఇది పాతపట్నం నెహ్రూనగర్‌లోని సీసీ రోడ్డు దుస్థితి.. ఇటీవల జల్‌జీవన్ పథకంలో భాగంగా కొళాయిల ఏర్పాటుకు రోడ్డును తవ్వి వదిలేయడంతో ఇలా దారుణంగా తయారైంది. ఇళ్ల నుంచి మురుగునీరు సైతం ఈ రోడ్డుపై నిలిచి పోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఆటో కూడా వెళ్లలేక, రాకపోకలకు పాదచారులు సైతం ఇబ్బందులు పడుతూ ఒక్కో సారి గాయాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-పాతపట్నం

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

● ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా కార్యదర్శి చల్ల శ్రీనివాస్



కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేవరకు పోరాటం కొనసాగుతుం దని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా కార్యదర్శి చల్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. పీఆర్సీ ని అమలు, సీపీఎస్ రద్దు, బకాయిల చెల్లింపులు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయా లని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కనకారావుకు వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎన్.వేణుగోపాలరావు, తాలుకా కార్యదర్శి టి. మోహనరావు, ఎన్.రవికుమార్, మురళీకృష్ణ, విజయ్‌రాథో, చందన, రమేష్, లక్ష్మణ్, వీఆర్వోల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

డీటీకి వినతిపత్రం



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సంఘ నేతలు

పలాసరూరల్: ఉద్యోగుల సమస్యల ను పరిష్కరించాలని ఏపీఎన్జీవో అసోసి యేషన్ పలాస అధ్యక్షుడు బోనెల గోపాల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం డీటీ లక్ష్మీనారాయణ కు వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు న్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని, దీంతో పోరుబాట పట్టామన్నారు. కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసి డెంట్ పి.శ్రీనివాసరావు, ట్రెజరర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన

నందిగాం: ఏపీజేఏసీ పిలుపుమేరకు బుధ వారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిర సన చేపట్టారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్య మ కార్యాచరణలో భాగంగా పెదతామరాపల్లి పాఠ శాల ఆవరణలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు, ఓపీఎస్‌ను పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు. బి.శంకరరావు, కె.గున్నయ్య, వి.కుమారి పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి..



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఆమదాలవలస: ఆమదాలవలసలో ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధ వారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీ లు ధరించి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కె.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో అసోసియేషన్ మండలాధ్యక్షుడు జి.హరికుమార్, ఉపాధ్యక్షుడు గురుగుబిల్లి రాము, ట్రెజరర్ షేక్ బాషా, జాయింట్ సెక్రటరీ కె.మనోహర్, సుజాత, లీలారాణి, శ్రీలత పాల్గొన్నారు.

సంస్థాగత పదవుల్లో నియామకంపై హర్షం

హరిపురం: టీడీపీ సంస్థాగత పదవుల్లో మందస మండంలో నలుగురు కార్యకర్తల నియా మకంపై ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బి.దుర్యోధన, రుద్రయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డబారు గ్రామానికి చెందిన గుంట చక్రపాణికి ప్రొఫెషన్‌వింగ్, బిడిమికి చెందిన తామాడ లోకనాథానికి సోషల్‌మీడియా, దున్నూరుకి చెందిన తిమ్మల విజయ్‌కుమార్‌కు నియోజకవర్గ సమన్వయకమిటీ, పిడిమందస గ్రామానికి చెందిన డొక్క లక్ష్మీనారా యణకు మండల సమన్వయకమిటీలో స్థానం కల్పిస్తూ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ప్రకటిం చడం అభినందనీయమన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో దాసరి తాతారావు, మండల లచ్చయ్య, రట్టి లింగరాజు, గుంట నారాయణరావు, జుత్తు కూర్మారావు తదితరు లున్నారు.

జ్ఞాన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న అతిథులు

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో 2004-05 సంవ త్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ బుధ వారం నిర్వహించారు. హెచ్‌ఎం వై.హరి బాబు ఆధ్వర్యంలో పురోహి తులు ఎం.రమేష్ శర్మ వేద మంత్రా లతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు, విగ్రహదాత విజయలక్ష్మి, గురుకుల ప్రిన్సిపాల్ బి.దమయంతి, ఉమామహేశ్వరరావు, ఇ.లక్ష్మణరావు, దేవేంద్రరావు, ఎం.రజని తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పొందూరు: తోలాపి తదితర పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్ బుధవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, గదులకు పూర్తిస్థాయిలో తలుపులు, కిటికీలు ఉండాలని బీఎల్‌వోలకు సూచించారు.

వైసీపీ ఆటలకు మిగిలింది 58 రోజులే..

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

● ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు వైసీపీలో చేరిక



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో వైసీపీ ఆటలు ఆడేం దుకు ఇంకా 58 రోజులే మిగిలి ఉన్నాయని టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి మండలం చిన్నసాన ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావుతో పాటు 150 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం విలేకరు లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు, ప్రతీ ఎకరాకు సాగునీరందేందుకు టీడీపీ ప్రణాళిక వేస్తోందన్నారు. వైసీపీ పాలనకు అంతిమ ఘడియలు ప్రారం భమయ్యాయన్నారు. సీఎం జగన్ పచ్చి మోసగాడని, ఉత్త రాంధ్ర ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఈ ప్రాంతంలోని సహజ సంపదను కొల్లగొట్టేశాడని విమర్శించారు. ఐదేళ్ల జగన్ పాలన వల్ల రాష్ట్రానికి ఎంతో నష్టం కలిగిందని, రాష్ట్రాన్ని అప్పుల మయం చేయడం తప్ప జగన్ రెడ్డి పాలనలో ఎక్కడా సంక్షేమం, అభివృద్ధి లేదన్నారు. రాష్ట్రానికి చేసిన అన్యాయం పై వాస్తవాలను ప్రతిబింబిస్తూ రాజధాని ఫైల్స్ సినిమా తీశా రని దీనిని ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. సీఎం జగన్ రెడ్డి కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి మళ్లీ అధికారంలో వచ్చేం దుకు కుట్రలు పన్నుతున్నారని దీనిని గమనించాలని సూచిం చారు. టీడీపీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేసి టెక్కలిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి పథకం నిర్వీర్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

పొందూరు: వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. బుధవారం పొందూరు పార్టీ కార్యా లయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి పథకం నిధులను ప్రభు త్వం ఇతర పథకాలకు మళ్లించి వేతనదారుల పొట్టకొడుతోం దని విమర్శించారు. గత ప్రభుత్వంలో వేసవిలో వేతనదారు లకు అదనంగా వేసవి భత్యం చెల్లించడంతో పాటు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, మంచి నీరు అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుతం అవేవీ కాన రావ డం లేదని, అందుకే వేసవిలో వేతనదారులు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి పూర్వ వైభవం తెస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రామ్మో హన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సంజీవయ్య



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: అంబేడ్కర్ మార్గంలో ఎదిగిన మహనేత, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, జిల్లా ఖజానా అధికారి రవి కుమార్ అన్నారు. బుధవారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వ ర్యంలో సంజీవయ్య జయంతిని పాలకొండ రోడ్డులోని సంజీవయ్య పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి వారు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. సంజీవయ్య నిరాడంబరుడని, అవినీతిలేని రాజకీయాలు అందించిన ఆదర్శనీయుడని కొనియాడారు. దళిత, బడుగు, బల హీన వర్గాల నాయకులు, ప్రజా ప్రతినిధులు సంజీవయ్య ఆశ యాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ము ఖ్యమంత్రిగా పనిచేసినా సొంత ఇల్లు కూడా లేని నిజాయితీపరుడని అన్నారు. కార్యక్రమంలో కంఠ వేణు, బోసు మన్మథరావు, చంటి, పురుషోత్తం రాంబాబు, రాజేశ్వరి, సంతోష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచముఖాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న బగ్గు రమణమూర్తి

జగన్నాథస్వామికాలనీ(పోలాకి): రాళ్లపాడు జగన్నాథ స్వామి కాలనీలో వేంచేసివున్న పంచముఖాంజనేయస్వామి ఆలయ వార్షికో త్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సా యంత్రం వరకు అర్చకులు విశేష పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, రాళ్లపాడు సర్పంచ్ బోర సోమేశ్వరరావు తది తరులు పాల్గొని స్వామిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి తులసిపాటి కృష్ణ, కె.తిరుమలరావు, జి.లక్ష్మీనారాయణ, బైరి భాస్కరరావు, కుసుమపోల వలస సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

పలాసరూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న బంద్‌ను జయప్రదం చేయాలని ప్రగతిశీల కార్మిక సంఘ సభ్యులు కోరారు. బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరంలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమం లో ప్రగతిశీల కార్మిక సమాఖ్య కార్యదర్శి పి.దుర్యోధన, అధ్య క్షుడు డి.నారా యణమూర్తి, సభ్యులు ఎం.ధర్మారావు, కె.పురుషోత్తం, త్రిలోచనరావు, మన్మథ రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏడీ జగన్నాథరావు

ఆమదాలవలస: వ్యవసాయ యాంత్రీకరణతో అధిక దిగుబడిని సాధించవచ్చని అనకా పల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాల కుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలి పారు. బుధవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఆధ్వ ర్యంలో 42వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు, యలమంచిలి వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతులు డాక్టర్ సత్యనారాయణ, బి.అప్పల స్వామి, ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి భగవాన్, ఆత్మ పీడీ రామచంద్రరావు, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

జయమ్మ వర్ధంతి సభను విజయవంతం చేయండి

పలాసరూరల్: విప్లవోద్యమ నేత జయమ్మ నాలుగో వర్ధంతిని ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తెలిపారు. బొడ్డపాడు లో అమరవీరులస్మారక మందిరంలో కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 22న శ్రీకాకుళం ఎన్జీవో కార్యాలయంలో జరుగు కార్యక్రమంలోనూ పాల్గొనాలని కోరారు.

ఘనంగా సరస్వతి పూజలు

పర్లాకిమిడి: శ్రీపంచమి సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సరస్వతీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను పాఠశాలల్లో చేర్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కట్టె జనుము సాగుపై రైతుల ఆసక్తి

● జిల్లాలో 20వేల ఎకరాల్లో పంట

(టెక్కలి)

టెక్కలి మండలంలో మూడేళ్ల కిందట వంద ఎకరాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన కట్టెజనుము (తెట్టంగి) పంట నేడు జిల్లా అంతటా విస్తరిం చింది. కట్టె జనుము వలన అధిక దిగుబడులు వస్తుండడంతో రబీలో రైతు లు ఈ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుండడం, క్వింటా రూ.6 వేలకు పైగా ధర పలుకు తుండడంతో జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, ఎల్ఎన్ పేట, సారవకోట, పలాస తదితర మండలాల్లో రైతులు కట్టెజనుము పంటను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా వరి, చెరుకు, పొగాకు వంటి పంటలు వేసే రైతులు ముందుగా కట్టెజనుము సాగు చేస్తా రు. దీనివల్ల పంటలు పండించే రైతులకు అనే ప్రయోజనాలు కలుగు తున్నాయి. భూమిలో సేంద్రియ కర్బనం పెరగడం, నేల గుల్లబారడం, నేలలో ఉప యోగపడే సూక్ష్మజీవుల శాతం పెరగడం, భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్ శాతం పెరుగుతున్నాయి. అందుకే రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కట్టెజనుము పంట పండించి అమ్మకానికి సిద్ధం చేసిన వెంటనే టొబాకో బోర్డు యంత్రాంగం దీనిని కొనుగోలు చేస్తోంది. మరోవైపు కట్టెజనుము గింజలు ఆయుర్వేదంలో ముడుకు నొప్పికి ఉపయోగించే హెంప్ ఆయిల్ తయారీకి కోల్‌కతా నుంచి కూడా కొందరు వచ్చి కొనుగోలు చేస్తు న్నారు. అలాగే విత్తనాభివృద్ధికి ఏపీ సీడ్స్ అధికారులు కూడా కొనుగోలు చేస్తోంది. ఇదిలా ఉండగా పొలాల్లో పచ్చని పూలు కనువిందు చేస్తున్నాయి.



టెక్కలి మండలంలో సాగు చేస్తున్న కట్టె జనుము

హైబ్రిడ్ వంగడాలు అందించేందుకు కృషి

కట్టె జనుము సాగును మూడేళ్ల కిందట టెక్కలి మండలంలో ప్రారంభించగా నేడు జిల్లా అంతటా విస్తరించింది. హైబ్రిడ్ వంగడాలు తయారు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను కోరుతున్నాం. హైబ్రిడ్ విత్తనాలను రైతులకు అందిస్తాం. కట్టెజనుము సాగు వల్ల ప్రధాన పంటల దిగుబడి పెరగడం, భూమికి మేలు, ఆరుతడి పంటలకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ పంట వచ్చే ఏడాది జిల్లాలో మరింత విస్తరించే అవకాశముంది.

-ఎస్.రంగారావు, వ్యవసాయాధికారి

PUBLIC NOTICE

The general public/Financial Institutions /Banks are hereby informed by M/s. A.P. State Financial Corporation (A.P.S.F.C), that, our Corporation has sanctioned Term Loan of Rs.1,25,00,000/- (Rupees One Hundred Twenty Five Lakhs only) to M/s. **SRI GANESH TRADERS,** Sy.No 81-1A, adjacent to NH-16, Balaga Village, Chapuram Panchayat, Srikakulam, AP-532001 a Sole proprietor concern represented by its proprietor Sri Varanasi Rajesh S/o Sri Varansi Krishnamurthy, Kotha Road junction, Main street, Gopi Nagar, Beside Sri Sai Srinivasa Kalyana Mandapam, Thotada Panchayath, Amadalavalasa (M), Srikakulam District-532484, against the following Collateral security property.

It is informed to us that the Scheduled property is owned and possessed by **M/s. SRI KRISHNA METAL INDUSTRIES,** Register office D.No. 12-11-19, Kaki Veedhi, Srikakulam Town & District, Business address: Plot No. 33, 40, 41, 46 & 47 APIIC-IDA, KUSALAPURAM, Srikakulam District a partnership Firm represented by its Four partners i.e., (1) Sri Bhogi Kishore Kumar, S/o Sri B. BhaskaraRao, (2) Sri KoradaGaddenna, S/o Late Korada Krishna Murthy, (3) Sri Korada Krishna Kiran, S/o Sri KoradaGaddenna (4).Sri Kottakota Gowri Sankararao, S/o Late Sanyasi Ramana (Surety) and agreed to mortgage below scheduled property as Collateral security by way of Memorandum of deposit of title deeds i.e., by depositing originals of **(1) Original Sale Deed Doc.No.2172/08 dt.25.07.2008 (2) Original Sale Deed Doc.No.2025/08 dt.08.07.2008, (3) Rectification Deed Doc.No.492/2016 registered with SRO- PONDUR (110)** along with link documents and supporting documents, in favor of A.P.S.F.C. for the loan sanctioned to **M/s. SRI GANESH TRADERS.**

Hence the general public is hereby informed to file objections, claims, interest and rights or titles if any what so ever in respect of scheduled property for this proposed mortgage, with documentary proof / evidences in writing to the undersigned within Seven days from the date of this notification. Otherwise this property is taken as mortgage as clear title and subsequent objections will not be entertained and not binding on the Corporation thereafter.

SCHEDULE OF THE PROPERTY

Free hold interest in land admeasuring 914.94 Sqyds or 765.00 Sq.mtrs bearing Plot Nos.33, APIIC-IALA- Industrial Park, in Sy.No.111(P) of Kusalapuram village , EtcherlaMandal , Srikakulam District, together with Buildings constructed and to be constructed thereon bounded by : **East:** APIIC Boundary / Abutting Private land ; **South:** Plot No.34; **West:** 40 feet wide Road, and **North:** Plot No 32.

BRANCH MANAGER

A.P.State Financial Corporation

Plot No. 377, 8th Lane, P.N.Colony,

Srikakulam. Ph: 08942-271756

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హరిపురం: మందస మండలం బాలిగాం రైల్వేగేటు వద్ద బుధవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. గేటు వద్ద రోడ్డు దాటు తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. తెల్లని గీతల షర్టు, లుంగీ ధరించి ఉన్నాడని, సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..


సంజీవరావు(ఫైల్)

జలుమూరు: లింగాలవలస గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చింతాడ సంజీవరావు (45) రాగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంజీవరావు గ్రామం వద్ద రోడ్డు దాటే సమయంలో నరసన్నపేట నుంచి చల్లవానిపేట వైపు వెళ్తున్న దిచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలపై బలమైన గాయాలు కావడంతో రాగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు సోదరి అప్పనర్సమ్మ ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు.

తిలారు ఆర్ఎస్‌లో చోరీ

జలుమూరు: తిలారు రైల్వే స్టేషన్‌లో వైశ్యరాజు సంతోషి రాజు ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్టు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగలుగొట్టి చొరబడ్డారు. ఐదున్నర తులాలు బంగారు ఆభరణాలు, పావు కిలో వెండి ఆభర ణాలు చోరీ చేసినట్టు బాధితుడు సంతోష్‌రాజు ఫిర్యాదు చేశారు. ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు


అధికారులకు సమస్యలు తెలుపుతున్న రైతులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి సమీపంలోని శ్రీరామాంజనేయ్య, అమృత లింగానగరం వద్ద ఉన్న శ్రీకృష్ణ శ్రీనివాస మోడరన్ రైస్‌మిల్లుల్లో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఏఎం (టెక్నికల్) ఆర్.హరిశంకర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వ హించి రికార్డులు పరిశీలించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో యథేచ్ఛగా ఒడిశా ధాన్యం దిగుమతి శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో జేసీ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దాడు లు నిర్వహించారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పండిన ధాన్యం రైతులు నుంచి పూర్తిగా సేకరించాలని, అలా కాకుండా ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కొంతమంది రైతులను కూడా అధికారులు విచారించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొత్తూరు, శ్రీకాకుళం, గార, సారవకోట, ఆమదాలవలస మండలాలకు అనుమతులు ఇవ్వడం వల్ల ఇబ్బంది పడుతున్నామని రైతులు అధికారులకు వివరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎల్ఎన్ పేట: బసవరాజుపేట రేవు వద్ద వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకొని ట్రాక్టర్ యజమాని ఎస్.జగదీష్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. కొన్ని రోజులుగా బసవరాజుపేట గ్రామ సమీపంలోని రేవు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు నిఘా పెట్టి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు.

జిల్లా గైనకాలజిస్టుల నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన జిల్లా గైనకాలజిస్టుల కార్యవర్గం

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా ప్రసూతి, స్త్రీవైద్య నిపుణుల సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక ఓ హోటల్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.రామారావు, గౌరవాధ్యక్షుడిగా దానేటి శ్రీధర్, కార్యదర్శిగా బగ్గు సంధ్య, ఉపాధ్యక్షులుగా డి.పార్వతి, పి.రేవతి, ఎస్.శ్రీదేవి, కోశాధికారిగా కె.ప్రశాంతి, సహాయ కార్యదర్శులుగా సందీప్, స్రవంతి, స్వర్ణలత, ప్రోగ్రామ్ అధికారిగా ఆర్.అరవింద్‌తో పాటు మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గత సంవత్సరం 100 మందితో ఏర్పాటు చేసిన శ్రీకాకుళం గైనకాలజిస్ట్ సొసైటీ జాతీయ స్థాయిలో గైనకాలజిస్ట్ ఫెడరేషన్‌కి అనుసంధానించబడి ఉంటుంది. ముందుగా విశాఖ హెచ్‌సీజీ కేన్సర్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు అండాశయ కేన్సర్‌లో ఆధునిక చికిత్స పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే గత సంవత్సరం నిర్వహించిన కార్యక్రమాల వివరాలను డాక్టర్ ఎస్.శ్రీదేవి వివరించగా, ఆర్థిక నివేదికను డాక్టర్ ఎం.సందీప్ ప్రతిపాదించారు.

కేఎఫ్‌సీలో అగ్నిప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం క్రైం: నగరంలోని రామలక్ష్మణ కూడలిలో ఉన్న కేఎఫ్‌సీ దుకాణంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో పొగ గొట్టంలో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు అలుముకోవడంతో సిబ్బంది, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక ఏడీఎఫ్‌వో వరప్రసాద్ తన సిబ్బందితో చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రెండు ఏసీలు, ఒవెన్లు, ఫ్రిడ్జి, కంప్యూటర్ కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షలు ఆస్తి నష్టం ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు ఏడీఎఫ్‌వో తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది దుర్గారెడ్డి, పాపా రావు, జనార్దనరావు, చిన్నంనాయుడు ఉన్నారు. ఇదే భవంతిలో పోలీసు శాఖకు చెందిన కార్యాలయం ఉంది.

బంద్ విజయవంతం చేయాలి


రాలీలో పాల్గొన్న సీఐటీయూ నేతలు, కార్యకర్తలు

ఎచ్చెర్ల: కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్పొరేట్ అనుకూల నిర్ణయాలతో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దుప్పాడ బంగార్రాజు, బోనెల రాము, పట్నాన రామారావు తదితరులు పాల్గొన్నారు.


కవిటి: సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం


పలాస: అలంకరణలో అమ్మవారు


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో..


నరసన్నపేట: రెడ్డికపేట పాఠశాలలో..

ఘనంగా వసంత పంచమి

● పలు ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని పలు ఆలయా ల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. చిన్నారులతో అక్షరాలు రాయించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


ఎల్ఎన్ పేట: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు


పలాస: సీతారామాలయ ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు


పొందూరు: తాడివలసలో వసంతపంచమి వేడుకలు

చినకొంచాడలో 'బాబు ష్యూరిటీ'


చినకొంచాడలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

పొందూరు: మండలంలోని కొంచాడ పంచాయతీ చిన కొంచాడలో బుధవారం టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్, బలగ శంకర భాస్కర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం అర్బన్: ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆటో ఎక్కే ప్యాసింజర్లపై మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించకూడదని తెలిపారు. హైవేపై వెళ్లేటప్పుడు సర్వీస్ రోడ్డు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు కారణమైనప్పుడు క్షతగాత్రులను వదిలేసి వెళ్లకుండా మానవతా దృక్పదంతో వారిని ఆస్పత్రిలో చేర్పితే 2022 చట్టం ప్రకారం శిక్ష తగ్గుతుందని వివరించారు. అనంతరం ఆటోడ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ వై.శృతి, ట్రాఫిక్ సీఐ అవతారం, ఎంబీఐ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, అనిల్, ఎన్జీవోస్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని కల్యాణం


స్వామి కల్యాణం, కోలాటం ఆడుతున్న దృశ్యం

జి.సిగడాం: సంతవురిటిలో ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి వైభవంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రతిష్ఠ మహోత్సవాలు ముగింపు సందర్భంగా స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులుతీరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బాలబొమ్మ శ్రీనివాస రావుతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు


మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ గోవిందరావు

లావేరు: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు సామాజిక తనిఖీలను చేపట్టనున్నట్లు ఎస్ఆర్‌పీ ఎం.గోవిదరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరంలో అన్నిరకాల పనులు కలిపి రూ.18.83 కోట్ల వరకు పనులు చేపట్టినట్టు తెలిపారు. తొమ్మిది డీఆర్‌పీ బృందాలతో ఈ తనిఖీలను చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. ఈ బృందాలకు ఉపాధి వేతనదారులు తగిన సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఎంపీడీవో గొర్లె భాష్కరరావు, పీఆర్‌ఏఈ లింగాల అప్పన్న, ఏపీవో ఆర్ సత్యవతి, జెఈ లెలిన్‌బాబు డీఆర్‌పీలు ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధిలు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు


హర్మోనియం పరిశీలిస్తున్న హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

ఎచ్చెర్ల: హస్త కళల అభివృద్ధికి, కళాకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు చర్యలు తీసుకుంటానని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. చిలకపాలెంలోని హర్మోనియం పెట్టెల తయారీదారు, హస్తకళాకారులు నాదెళ్ల రమణాచారి, అప్పలచారిలను ఆమె బుధవారం కలుసుకున్నారు. ఈ కళాకారుల గుర్తింపు కార్డుల మంజూరుకు విజయవాడలోని డీసీహెచ్ కార్యాలయానికి దరఖాస్తుల పంపామని, ఇంకా కార్డులు రావాల్సి ఉందన్నారు. కళల అభివృద్ధికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, కళాకారులు వెంకటనాయుడు, నెల్లి దాముడు, జక్కా బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల ప్రారంభోత్సవం


ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

గార: ప్రసిద్ధ శ్వేతగిరిపై నూతనంగా నిర్మించిన అయ్యప్ప, అభయ ఆంజనేయస్వామి, ఆలయాల ప్రారంభోత్సవం బుధవారం వైభవంగా సాగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహీంద్రా రవికుమార్ శర్మ, వసుంధర దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, టీడీపీ నాయకులు గొండు శంకర్, మాజీ ఎంపీపీ భాస్కరరావు, సర్పంచ్‌లు కె.ఆదినారాయణ, గొల్లంగి ఆరుద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గార: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. బుధవారం దీపావళి జంక్షన్ వద్ద సాందీపని విద్యాలయంలో చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి రమణమూర్తి, అంబటి రంగారావు, అంబటి చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన పెంచుకోవాలి


ఈవీఎం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సమూన్ తదితరులు

కలెక్టరేట్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఆయా రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు అవగాహన కల్గి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు గల రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అవగాహన కల్పించేందుకు భారత ఎన్నికల సంఘం ముద్రించిన ప్రత్యేక హ్యాండ్ బుక్‌ను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. పోలింగ్ నిర్వహణ మొదలు సాంకేతిక అంశాలు, ఆయా పరికరాల పూర్తి వివరాలు హ్యాండ్ బుక్‌లో ఉంటాయని, వీటిలో ప్రతీ అంశాన్ని తెలుసుకుని ఉండాలన్నారు. వీటిని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఈవీఎంల సాయంతో ఓటింగ్ ప్రక్రియ, అలాగే వీవీ ప్యాట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా సంచార ప్రదర్శన వ్యాన్లతో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. డెమో ఈవీఎంల ద్వారా స్వయంగా ఓటు వేసి తమ అనుమానాలను ఓటర్లు నివృత్తి చేసుకుంటారని చెప్పారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, పార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ) మల్లిబాబు (కాంగ్రెస్), సురేష్‌సింగ్ బాబు (బీజేపీ), డి.గోవిందరావు (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రహదారి భద్రతా వారోత్సవాలు


డ్రైవర్లను సత్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి: జిల్లా ప్రజా రవాణా శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్టీసీ డిపో-1 గ్యారేజీ ఆవరణలో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. 1వ డిపో మేనేజర్ మల్లిఖార్జునరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గంగాధర రావు, ఎంవీఐ, ట్రాఫిక్ సీఐ అవతారం, డాక్టర్ కె.కిరణ్‌కుమార్, సీఎంవో పాల్గొన్నారు. గత నెల 15న ప్రారంభమైన ఈ మాసోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జిల్లా స్థాయిలో సుదీర్ఘకాలం పాటు ప్రమాదరహిత డ్రైవింగ్ రికార్డు కలిగిన ముగ్గురు డ్రైవర్లకు నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీరాజు, పర్సనల్ ఆఫీసర్ పి.కృష్ణవేణి, నాలుగు డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, అన్ని అసోసియేషన్‌ల ప్రతినిధులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతామణి ఆలయ సింహద్వారం ప్రారంభం



కవిటి: కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయంలోని ఉత్తర సింహద్వారం బుధవారం ప్రారంభించారు. ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన బి.ప్రభాకరరావు, ఉమారాణి కుటుంబసభ్యులు ఆర్థిక సాయంతో నిర్మించారు. చింతా మణి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


విగ్రహం ఆవిష్కరిస్తున్న దృశ్యం

సోంపేట: పాలవలసలో సరస్వతి విగ్రహాన్ని బుధ వారం ఆవిష్కరించారు. కర్రి రుక్మిణి పాపారావు దంపతుల సహకారంతో నిర్మించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ స్ఫూర్తితో..


లోకేశ్‌తో నిఖిల

రణస్థలం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఓ విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకుంది. ఎనిమిదేళ్ల క్రితం మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కుమారుడి వివాహానికి లోకేశ్ హాజరు కాగా కలిశెట్టి అప్పలనాయుడు కుమార్తె నిఖిల అనే తొమ్మిదేళ్ల చిన్నారితో ముచ్చటించగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదవాలన్నదే తన ఆశయమని వెల్లడించింది. నిఖిల బీటెక్ పూర్తి చేసి స్టాన్‌ఫోర్డ్‌లోసీటు సాధించేందుకు సిద్ధమవుతోంది.

'శంఖారావం' సభను విజయవంతం చేయండి

లావేరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ లావేరులో గురువారం మధ్యాహ్నం చేపట్టనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఐ.తోటయ్య దొర బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీకి రెండు కళ్లు

అరసవల్లి: అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి అవసరమని, ఆ రెండూ కళ్లుగా టీడీపీ పరిపాలన సాగిందని, అదే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం వారి స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేదలకు పెన్షన్లు, రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా ఇళ్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే ఆదర్శనీయంగా నిలిచారని కొనియాడారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సంపద సృష్టించాలి, అందరికీ పంచాలి, అన్ని వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న ధ్యేయంతో పనిచేసే దూరదృష్టి గల నాయకుడన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలపర్చడానికి విధానాలను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని, కానీ అప్పులు చేసి అనుత్పాదక వ్యయం చేస్తే దివాలా తీయడం తప్ప ఏమీ మిగలదని, ఇప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి, వడ్డీ కూడా కట్టలేని పరిస్థితి ఉందని, అసలు ఎలా ఈ అప్పులను తీర్చగలరో వైసీపీ నాయకులు ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

సోంపేట: కొర్లాం గ్రామసచివాలయ ప్రాంగణంలో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శిబిరంలో 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు పూజిత, జి.గోపి, బి.చిన్నారావు, గ్రామస్థులు రాంబుడ్డి గణపతి, తామాడ వాసుదేవ్ పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా శేషాద్రినాయుడు


ఎస్పీని కలిసిన ఏఆర్ డీఎస్పీ శేషాద్రినాయుడు

శ్రీకాకుళం క్రైం: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ డీఎస్పీగా ఎల్.శేషాద్రి నాయుడు బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ జీఆర్ రాధికను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈయన మన్యం జిల్లా పార్వతీపురం నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో శ్రీకాకుళం వచ్చారు.

'ఆడుదాం ఆంధ్రా'తో వైసీపీ సాధించిందేమిటీ?

● టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసుదేవరావు

పొందూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వం సాధించిందేమిటని టీడీపీ బీసీ సెల్ ఆమదాలవలస నియోజకవర్గం అధ్యక్షుడు, గోరింట మాజీ సర్పంచ్ చింతాడ కృష్ణ వాసుదేవరావు ప్రశ్నించారు. బుధవారం పొందూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాపేరులో వందలకోట్లు ఖర్చు రాష్ట్రప్రజలపై రుద్దడంతప్ప క్రీడాకారులకు ఒరిగిందేమీ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో తమ సొంత మీడియాకు యాడ్ల పేరుతో కోట్లు సమర్పించడం తప్ప క్రీడాకారులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల క్రీడలకు ఏ మాత్రం ఖర్చుచేయని ప్రభుత్వం, క్రీడాకారులను ఏ విధంగా తయారు చేయగలదని ప్రశ్నించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడలను నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపికచేయాలే తప్ప రాజకీయ ప్రయోజనాలకోసం నిర్వహించే ఇటువంటి కార్యక్రమాల ద్వారా క్రీడాకారులు వెలుగులోకి రారన్నారు.